క్లుప్తంగా

శివస్వాములకు అన్నదానం

ఆదోని అర్బన్ : పట్టణంలోని కొత్త బస్టాండు రోడ్డులో వెలిసిన సుంకలమ్మ దేవాలయంలో శివమాల ధరించిన శివభక్తులకు అన్నదానం కోసం పట్టణంలోని దాత ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. సోమవారం పారిశ్రామికవేత్త నాగప్ప జ్ఞాపకార్థంగా ఆయన అల్లుడు సుగూరప్ప శివదీక్షపరులకు అన్నదానం కోసం వంద ప్లేట్‌లు, వంద గ్లాసులు అందజేశారు. అలాగే వారికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బసవరాజ్, కవిత, అమూల్య, లలితమ్మ పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం



వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమనోజ్‌రెడ్డి

ఆదోని అర్బన్ : పట్టణంలో రోటరీ క్లబ్ వారు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమనోజ్‌రెడ్డి అభినందించారు. ఆదివారం స్థానిక మల్లికార్జున విద్యాలయం వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ప్రజలకు సేవలందించేడంలో సాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు . క్లబ్ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వికలాంగులు ట్రైసైకిళ్లు కావాలని ఐదుగురు కోరడంతో రోటరీ క్లబ్ తరపున రెండు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ ఒకటి, భారత్‌గ్యాస్ సందీప్‌రెడ్డి ఒకటి, సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థంగా ఒకటి చొప్పున అందజేయడం జరిగిందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు షీల్డ్‌ను అందజేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఎంఎల్‌జీ కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీ విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన మ్యాచ్‌లో చివరికి ఎన్‌జీవోస్ కాలనీ విద్యార్థులు విజేతగా నిలిచారు. విజేత జట్టుకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, గణేష్, పవన్, నాగరాజు,శివ,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని తుంగభద్ర నది తీరంలో గుర్తు తెలియని 60 సంవత్సరాల వృద్ధుడు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. తెల్లచొక్కా, నీలి రంగు అడ్డపంచ ధరించి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎవరికైనా ఆచూకీ తెలిసిన వెంటనే 9121101152కి ఫోన్ చేయాలని మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు.

ప్రభుత్వాలపై పోరాడుదాం

ఆదోని రూరల్ : ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుదామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సీపీఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తిమ్మారెడ్డి బస్టాండు కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు కె.రమేష్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచేసి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని సీపీఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా వీరాంజనేయులు, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా గోరుకల్లు అంజిత్‌గౌడ, కొత్తూరు విష్ణు, సహాయ కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా రసూల్‌సాబ్‌తో పాటు 11 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు టి.వీరేష విజయ్, ప్రజానాట్య మండలి నాయకులు కె.వీరన్న పాల్గొన్నారు.

గోవులే నిజమైన సంపద

కర్నూలు కల్చరల్: గో సంపదే భారతీయులకు నిజమైన సంపద అని లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. కనుమ పండుగ పురస్కరించుకొని సోమవారం ఓల్డ్ సిటీ లోని లలితా పీఠంలో ఘనంగా గోపూజ నిర్వహించారు. అంతకుముందు రాఘవేంద్ర సత్సంగం ఆధ్వర్యంలో కోలాటం, భజనలతో శోభాయాత్ర నిర్వహించారు. డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో తుంబిగనూరు

- కొత్తగా పంచాయతీ ఏర్పాటు
- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో రెండేళ్లల్లో రూ.25 లక్షలతో పనులు
- గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు



గ్రామంలో నాడు రోడ్డు దుస్థితి



ప్రస్తుతం సీసీ, డ్రైనేజీతో కళకళలాడుతున్న రోడ్డు

కోసిగి: కోసిగి మండలం తుంబిగనూరు గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. రెండేళ్ల క్రితం వరకు సాతనూరు పంచాయతీ పరిధిలోని తుంబిగనూరు మజరా గ్రామంగా ఉండేది. దీంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. ప్రస్తుతం కొత్త పంచాయతీగా ఏర్పాటు కావడంతో గ్రామంలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి.

నాడు సౌకర్యాలకు దూరం..

తుంబిగనూరు గ్రామంలో 155 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గ్రామం అంతటా మట్టి రోడ్లు ఉండేవి. గ్రామం చుట్టు పొలాలు, పొలాల మధ్య గ్రామం ఉంది. డ్రైనేజీ కాల్వలు లేక మురుగు నీళ్లన్నీ రోడ్ల పై నిల్వ ఉండడం, దుర్వాస వెదజల్లడం, విపరీతంగా దోమలు వ్యాప్తి చెందడంతో గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. తాగునీరు కూడా పొలాల వెంబడి తిరిగి వ్యవసాయ బోర్ల నీటిని తెచ్చుకోవాల్సి వచ్చేది. గ్రామం సమీపంలో ఎస్‌పీ స్కీమ్ నుంచి నీళ్ల సరఫరా సక్రమంగా చేసేవారు లేక తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. సమస్యలను పరిష్కారం నోచుకోక ప్రజలు నానా కష్టాలు పడ్డారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకా కొత్త పంచాయతీగా..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సాతనూరు పంచాయతీలో ఉన్న తుంబిగనూరు గ్రామం కొత్త పంచాయతీగా ఏర్పడింది. పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వారం ఈరన్న సర్పంచ్‌గా గ్రామ ప్రజలు గెలుపించుకున్నారు. సర్పంచ్ అధికారం చేపట్టాక ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డిల దృష్టికి గ్రామ ప్రజలు ఇబ్బందులు, సమస్యలను తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.20లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.5లక్షలు కేటాయించి గ్రామంతటా ఉన్న రోడ్లలో పేరుకుపోయి ముళ్ల పొదలు, చెత్తాచెదారం జేసీబీతో తొలగించి గ్రామమంతటా డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించారు. అలాగే గ్రామ శివారులో ప్రత్యేక బోరును వేయించి ఇంటింటా పుష్కలంగా తాగునీటిని అందిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో నాడు–నేడు కింద రూ.20లక్షలతో అదనపు గదులు, కాంపౌండ్ వాల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వాడవాడలా ఎల్ఈడీ బల్బులను పంచాయతీ నిధులతో సర్పంచ్ దగ్గరుండి వేయించారు.

గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు



మా గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయడంతో చాల సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో రోడ్డు, విద్యుత్ సౌకర్యం సరిగ్గాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రాత్రిళ్లు విషపురుగుల భయం ఉండేది. మా గ్రామం మారుమూల నదితీర మజరా గ్రామం కావడంతో ఏఅధికారులు ఇక్కడకు వచ్చేవాళ్లు కారు. కొత్త పంచాయతీ ఏర్పాడిన తర్వాత మా గ్రామంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. చాల సంతోషకరంగా ఉంది.

– ఉరుకుందప్ప, గ్రామస్తుడు

ఎమ్మెల్యే సహకారంతోనే సాధ్యమైంది



మా గ్రామంలో కోసిగి మండలంలోని చిట్టచివరి ప్రాంతం. పోలాల మధ్య ముళ్ల పొదలు, అధ్వానంగా రోడ్లు, వీధిలైట్లు లేక అంధకారంతో ఉండేవాళ్లం. గ్రామ ప్రజలు నా పై నమ్మకంతో మొట్ట మొదటి సర్పంచ్‌గా గెలిపించారు. గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని దృఢ సంకల్పం పెట్టుకున్నాను. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. మా గ్రామం సమస్యలను పరిష్కరించాలని కోరాను. వారు సానుకూలంతో నిధులు కేటాయించారు.

– వారం ఈరన్న, గ్రామ సర్పంచ్ , తుంబిగనూరు

ఘనంగా బీరప్ప స్వామి దేవర



ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని నేలకోసిగి గ్రామంలో కొలువుతీరిన బీరప్ప స్వామి దేవర ఉత్సవం కురుబ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారిని ఆలయం చెంత నుంచి పల్లకీలో కలసాలు, మేళతాళాలు,డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులోని పోలాల వరకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారికి పూజారి పెద్ద అయ్య ఎల్లప్ప, సోమప్పల ఆధ్వర్యంలో గంగపూజ, అభిషేకాలు, బండారు అర్చనలు గావించారు. సాయంత్రం స్వామి వారి పల్లకీని యథావిధిగా గ్రామంలోని ఆలయం చెంతకు చేర్చారు. కార్యక్రమంలో కురుబ సంఘం పెద్దలు కురువ మల్లయ్య, లింగన్న, రామన్న, శ్రీరాములు, కౌతాళం వీరేష్, అడ్వకేట్ యల్లప్ప, కోసిగి మల్లయ్య పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో సబ్‌కలెక్టర్

కౌతాళం: మండల పరిధిలోని మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామిని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దర్శించుకున్నారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయనకు వీఆర్‌ఓలు అయ్యప్ప, నర్సిములు రెవెన్యూ సిబ్బంది ఆలయ అర్చకులు స్వాగతం పలికి పూజల అనంతరం శాలువ పూలమాలతో సత్కరించారు.

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సోమవారం సెలవు రోజుతో పాటు ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగలు ఉండడంతో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఘనంగా గోపాలదాస ఆరాధనోత్సవం





ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, రథోత్సవం ముందు భజనలు చేస్తున్న భక్తులు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం గోపాలదాస ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ మేనేజర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి వారికి క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, పూలు, వెండి అలంకరణ చేశారు. అలాగే గోపాలదాస స్వామికి అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం ముందు భక్తి భజనలతో ముందుకు సాగారు.

అందరినీ దగ్గర చేసిన సంక్రాంతి



విజేతకు బహుమతి అందజేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్ : సంక్రాంతి పండగ అందరినీ దగ్గర చేసిందని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్, రవి, శీన, మోహన్ అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం మండిగిరిలోని దుర్గమ్మ ఆలయ సమీపంలో చిన్నారులకు, మహిళలకు స్పర్శ ద్వారా తల్లిని గుర్తు పట్టే ఆట నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు జమీర్, రాజు పాల్గొన్నారు.

రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనా మహోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీపై ఉంచి భజనలు చేస్తూ, కోలాటాలు, నృత్యాలు మధ్య కల్లూరు పురవీధుల గుండా ఊరేగించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు లో జన్మించిన దత్తాంశ సంభూతుడైన రామిరెడ్డి తాత ఈ ప్రాంతాన్ని పావనం చేశాడన్నారు. టీడీపీ పాణ్యం ఇన్‌చార్జ్ గౌరు చరితా రెడ్డి, వెంకటరెడ్డి, బీజేపీ నేత బైరెడ్డి శబరిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ సేవా సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, సంస్థాన్ కోశాధికారి హనుమంతురెడ్డి, పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

22న ఏ షామ్ మస్తానీ

కర్నూలు కల్చరల్: ఆర్ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో ఏ షామ్ మస్తానీ పేరుతో మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, సింగర్ రాణి తెలిపారు. ప్రముఖ గాయనీ గాయకులు అర్షద్, లత, అమీర్, చాంద్‌బాష, జయపాల్, సుధాకర్, దస్తగిర్ బాష మ్యూజికల్ నైట్‌లో ప్రసిద్ధ పాటలు ఆలపిస్తారని పేర్కొన్నారు.

శోభాయమానంగా గోదా రంగనాథ కల్యాణం



కల్యాణమూర్తులుగా గోదా రంగనాథ స్వామివారు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారు మామిదాలపాడు సమీపంలో వెలసిన గోదా గోకులంలో ధనుర్మాస ఉత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అష్టాక్షరీ పీఠాధిపతులు శ్రీ త్రిదండి రామానుజ జీయర్‌స్వామి ఆశీస్సులతో వేద పండితులు గోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని కనులపండుగలా నిర్వహించారు. అనంతరం స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, గోదా విష్ణు సహస్రనామ పారాయణం, కోలాటం, భజనలు నిర్వహించారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, కమిటీ సభ్యులు పల్లెర్ల నాగరాజు, రవికుమార్, ద్వారకానాథ్, యడ్లపల్లి శివారెడ్డి, బాల సుధాకర్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



బాధితకుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. కోసిగి మండలం ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన ఆరే అళ్లప్ప అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుని కుటుంబానికి బీమా కింద రెండవ విడుత రూ.90వేలు మంజూరైంది. సోమవారం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో బాధిత కుటుంబానికి నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ యజమాని ఆకస్మికంగా మృతి చెందితే వైఎస్సార్ బీమా పథకం కింద ఆసరాగా నిలుస్తోందన్నారు. వచ్చిన నగదులో పిల్లలను బాగా చదివించుకుని బంగారు భవిషత్‌ను అందించాలని సూచించారు. బీమా నగదుకు అందించినందుకు మృతుని భార్య ఆరె గోవిందమ్మ, కుమారుడుతో కలిసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, సురేంద్ర, భీమసేనా, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు

పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి 67వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంచాల లక్ష్మినారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామేలు మాట్లాడుతూ ఒక సామాన్య పేద కుటుంబంలో పుట్టి ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని 4సార్లు ముఖ్యమంత్రిగా పాలించి దేశంలో ఉక్కు మహిళగా పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మన్న, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

కౌతాళం: రైతులు ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ శేషాద్రి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్ కింద పంటలు సాగు చేసిన రైతులు ఫిబ్రవరి 12 లోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో రబీ సీజన్‌లో 4,700ఎకరాల్లో పంటలు సాగుచేశారని అత్యధికంగా వరి పైరును వేశారన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 1700 ఎకరాలు మాత్రమే నమోదు చేసుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

– ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దహరివాణం చెక్‌పోస్టు సమీపంలో గజ్జహళ్లి గ్రామం క్రాస్ వద్ద రెండు బైకులు ఢీకొని ఒకరు మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలు, మరొకరికి స్వల్ప గాయాల పాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల బంధువులు తెలిపిన వివరాలు ఉన్నాయి. హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన హాజిమలంగ్ (40) సిరుగుప్పలో బంధువుల శుభ కార్యానికి హాజరై, తిరిగి స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. అదే సమయంలో ఆదోనిలోని హనుమాన్ నగర్‌కు చెందిన రాజేష్, వడ్డేగేరికి చెందిన హనుమంతు సిరుగుప్పలో బంధువుల ఇంటికి వెళ్తున్నారు. హరివాణం చెక్‌పోస్టు సమీపంలో గజ్జహళ్లి క్రాస్ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హాజిమలంగ్, రాజేష్ తీవ్రంగా గాయపడగా, హనుమంతుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హాజిమలంగ్ మృతిచెందాడు. రాజేష్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నడిపి ఈరన్న (ఫైల్)

ఆదోని రూరల్ : ఆదోని మండలంలోని జి.హొసళ్లి గ్రామానికి చెందిన వడ్డే నడిపి ఈరన్న అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ రమేష్ బాబు సోమవారం విలేకరులకు తెలిపారు. నడిపి ఈరన్న అనే వ్యక్తి పొలాన్ని కౌలుకు చేసుకుంటూ జీవనం గడిపేవాడు. అయితే గత రెండేళ్లుగా పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు ఎక్కువై, వాటిని తీర్చలేక మనస్థాపం చెంది ఇంటి బయట ఉన్న పాకలో శనివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య వడ్డె వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

నీలం సాయినగర్‌లో భారీ చోరీ



బీరువా పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

కర్నూలు: కర్నూలు శివారులోని పెద్దపాడు రోడ్డులో గల నీలం సాయినగర్‌లో భారీ చోరీ జరిగింది. వడ్డె సురేష్‌కుమార్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉద్యోగం చేసి ఇటీవల కర్నూలులోని నీలం సాయి నగర్‌లో నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం హెచ్.కైరవాడికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మెయిన్ డోర్‌కు వేసిన తాళాలు పెకిలించి లోపలికి వెళ్లి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.3 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. సురేష్ కుమార్ సోమవారం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. నాలుగవ పట్టణ ఎస్ఐ మోహన్‌కిషోర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడు సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని అలంపూర్‌కు వెళ్లే దారిలో 240/4.5 కిలోమీటర్ వద్ద రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి వయసు50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5 అడుగులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కె.వై.సంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్ఐ సురేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలు లేత గులాబీ రంగు చలి కోటు, వంకాయపూత రంగు జాకెట్, ముదురు వంకాయ పూత రంగు, తెల్లటి ఆకుపచ్చ డిజైన్ ఉన్న చీర ధరించింది. మృతురాలికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 94407 56043 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సురేష్ బాబు కోరారు.

బాలల దురలవాట్లపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): బాలలు దురలవాట్లు, వ్యసనాలకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ రీసెర్చ్ (న్యూఢిల్లీ) మెంబర్ సెక్రటరీ రూపాలి బెనర్జీ సింగ్ సూచించారు. సోమవారం ఆమె ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా బాలల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. చిన్నారులు డ్రగ్స్, మద్యం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు గురి కాకుండా చూడాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్యా, పోలీసు, వివిధ శాఖల అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 13, 14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఒలంపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు సోమవారం అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకం సాధించడంతో పాటు జాతీయ జట్టులో ముగ్గురు క్రీడాకారులకు అవకాశం రావడం హర్షించదగ్గ విషయమన్నారు.